# ఊరు వీడ్కోలు చెప్పింది

స్కూలు ముందు మామిడిచెట్టు పక్కనే మట్టి బాటలోంచి బురదలో పూర్తిగా వర్షాన్ని కాయలేని గొడుగు కింద సగం సగం తడిసిపోతూ గబగబా యింటికి వెళ్తోన్న రామచంద్రం మేష్టార్ని చూసి ప్రైమరీ హెల్త్ సెంటర్ అరుగుమీద నుంచున్న పరాబ్రహ్మం పలకరించాడు — "వర్షంలో తడిసి ఏం వెళ్తారు మేష్టారూ. కాస్సేపు యిలా వచ్చి కూచోండి, తగ్గాక వెళ్ళుదురుగాని" అని.

పరాబ్రహ్మానికి మేష్టారి ఉబ్బసం జబ్బు గురించి తెలుసు. అందుకే ఆయన మేష్టార్ని పిలిచాడు. కాని రామచంద్రం మేష్టారికి ఆగాలనిపించలేదు. ఇంటికి వెళ్ళి యీ వార్త కాస్త భార్య చెవిన వెయ్యాలి. తల్లికి కూడా వుత్తరం రాసి పడేయాలి. అందుకే ఆయన "లేదులెండి కాస్త పనుంది. వర్షం తగ్గాక మళ్ళీ వచ్చి తీరిగ్గా మీతో మాట్లాడుతాను. ఓ విశేషం వుంది" అంటూ ఆగకుండానే కదిలి పోయాడు.

రామచంద్రం మేష్టారు 'ఓ విశేషం వుంది' అని అన్న మాటని ఆ పక్కనే అవతలి వైపున వున్న పంచాయితీ ఆఫీసులో యీ వర్షాన్ని గురించే ముగ్గురు నలుగురితో మాట్లాడుకొంటూన్న సర్పంచ్ చెవిని పడింది. ఆయన కుతూహలంగా చూసి —

"ఏమిటి పంతులుగారూ విశేషాలు. వర్షంలో ఎక్కడికి ....
రండి, కాస్సేపు కూచుని వెళ్ళుదురుగాని" అన్నాడు. తనే లేచి,
ఆ కుర్చీలో కూచోమని తను వేరే కుర్చీ తెప్పించుకున్నాడు.

రామచంద్రం మేష్టారికి వెళ్ళక తప్పలేదు. తనంటే సర్పంచ్‌కి
చాలా గౌరవమూ, అభిమానమూనూ. ఈ వార్త ఆయన చెవినికూడా
వేయాలి.

రామచంద్రం మేష్టారు కుర్చీలో కూచోలేదు. పంచె బాగా
తడిసిపోయింది. అరుగుమీదే నిలబడి, పుస్తకంలోంచి ఓ కాగితం
తీసి ఆయనకిచ్చాడు - ఇది ఇప్పుడే వచ్చిందట. హెడ్‌మాస్టరుగారు
పిలిచి యిచ్చారు - అని.

సర్పంచ్ ఆ కాగితం తీసుకుని చదివాడు. పూర్తిగా చదవకుండానే
ఓసారి తలెత్తి "ఏమిటి పంతులుగారూ! యీ వూరు విడిచిపెట్టి
వెళ్ళిపోవడమే" అన్నాడు. రామచంద్రం మేస్టారు ఏమీ మాట్లాడ
లేదు. ఓ చిరునవ్వు మాత్రం నవ్వారు.

సర్పంచ్ ఆ కాగితాన్ని పూర్తిగా చదివి "మేస్టారుని వాళ్ళ
వూరుకి బదిలీచేశారయ్యా" అన్నాడు పక్కవాళ్లను ఉద్దేశిస్తూ.

వాళ్ళు కాస్సేపటికి గాని ఆశ్చర్యంనించి తేరుకోలేదు.

"ఆదేమిటి మేస్టారూ మా వూరిని విడిచిపెట్టి వెళ్లిపోతారా"
అన్నాడు ఒకతను. ఆ కంఠంలో అభిమానం, ఆత్మీయత వారి కళ్లలో
దిగులూ గుర్తించి రామచంద్రం మేస్టారు పులకరించిపోయారు.

"మీకు తెలీని విషయాలు ఏమున్నాయండి సుబ్బయ్యగారూ. మా
తల్లిగారికి వార్ధక్యం వచ్చేసింది. చాదస్తం మనిషి. వున్న వూరు
విడిచిపెట్టడానికి వొప్పుకోదు. దగ్గరుండి చేసుకుంటేనే గాని ఆ
పొలం ముప్పయ్ బస్తాలన్నా రాల్చదుకదా. మా అమ్మగారికా -

అంత ఓపికలేదు. నేను దగ్గరవుంటే ఆమెకు ఈ తిప్పలన్నీ వుండవు. ఈ వయసులో ఆమెకింత సేవ చేసే అదృష్టం కూడా కలుగుతుంది.

సర్పంచ్ ఉత్సాహంగా ఏమీ మాట్లాడలేకపోయాడు. అతనికి చాలా దిగులుగా వుంది. ఈ వూరికి వచ్చి పిల్లలికి యింత చదువు చెప్పడమే కాకుండా యిక్కడి విషయాల్లో కల్పించుకుని ఎన్నో సత్కార్యాలు జరిపించి వూళ్లో చిన్నా పెద్దా అని లేకుండా అందరికీ తలలో నాలుకలా మెలిగి ఎంతో కొంత ఉపకారం చేసిన రామచంద్రంగారిని వదులుకోవడం చాలా దిగులుగా వుంది. ఆయన పట్టుదలవల్లే స్కూలుకి పక్కా బిల్డింగూ, వూరుకి ఎలక్ట్రిసిటీ, ప్రైమరీ హెల్త్ సెంటరూ వచ్చాయి. కుర్రాళ్లు పనీపాటా లేక చెరువు గట్టునా, గుళ్లోనూ పేకాడుతూ కూచోకుండా ఏడాది పొడుగునా గుళ్లో ఉత్సవాలనీ, నాటకాలనీ, భజన్లనీ ఏర్పాటు చేశారు. పెద్దాళ్లకు రాత్రిళ్లు చదువు చెప్పి యీనాటికి తమంత తాము ఓ వుత్తరం ముక్క రాసుకోగలిగేటట్టూ, ఓ పేపరుని కూడబలుక్కుని చదివేట్టూ చేశారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా ఎవరింట్లో ఏ శుభకార్యం జరిగినా ఆయన అక్కడ హాజరై తనకు తోచిన సహాయం చేశారు. అలాటి మనిషి యీ వూరు విడిచి వెళ్లిపోతాడంటే సర్పంచికీ, అక్కడ కూచున్న ముగ్గురు నలుగురికీ దిగులుగా వుంది. ఆ దిగులువల్లే సర్పంచ్ ఉత్సాహంగా ఏమీ మాట్లాడలేకపోయాడు.

ఆ మౌనాన్ని రామచంద్రం మేస్టారు అర్థంచేసుకున్నారు. అందుకే ఆయన "నాకు మాత్రం యీ వూరుని విడిచిపెట్టాలని వుందటండీ. తప్పని పరిస్థితి. హెడ్‌మాస్టరుగారు పిలిచి యీ కాగితం యిచ్చాక స్వగ్రామానికి బదిలీ అయి వెళ్తున్నానన్న ఆనందం కన్న

యీ వూరుని విడిచి వెళ్లిపోవలసి వస్తోందే అన్న బాధే ఎక్కువ కలిగింది. వచ్చిన కొత్తలో కనిపించిన వాళ్లనల్లా పట్టుకున్నాను- బదిలీ చేయించమని. ఇన్నాళ్లకి అయాచితంగానే యిది జరిగింది. నిజానికి యీ వూరుని విడచిపెట్టెళ్లినా మనసంతా యిక్కడే వుంటుంది" అన్నారు.

వర్షం తెరిపి యిచ్చాక వాళ్ల మంచితనాన్నే గుర్తు చేసుకుంటూ యింటిని చేరుకున్నారు.

గుమ్మంలో అడుగు పెడుతూనే భార్యను కేకేశారు ఆయన. ఆవిడ యింట్లోనే వుంటే "ఇదిగో వచ్చె" అనేది. అలాంటి శబ్దమేదీ రాకపోతే ఆయన ఉత్సాహమంతా ఎగిరిపోయింది. బహుశా ఏ పొరుగింటికో వెళ్లిందేమో. కబుర్లలో పడితే ఇప్పు డప్పుడే తెములుతుందా!

పెద్ద కూతురు మాత్రం కావిడి పెట్టెమీద కూచుని గోళ్లనీ, గోళ్లతోపాటు వేళ్లనీ కొరుక్కుంటోంది. పళ్ళన్నీ బైటికి తీసి తండ్రిని చూసి నవ్వింది.

"మీ అమ్మ ఏదే, ఎక్కడ కెళ్లింది? అని అడిగారు చేతులు వూపి.

ఆ అమ్మాయి ఏమీ మాట్లాడలేదు. అతని కంఠం విని దొడ్లో వర్షం నీటిలో పడవల్ని వొదిలి ఆడుకుంటోన్న చిన్న కూతురూ, కొడుకూ ఇంట్లోకివచ్చారు. "అమ్మ రమణమూర్తి గారింటికి వెళ్లింది నాన్నా. అత్తయ్యకి నొప్పులొచ్చాయని యిప్పుడే వచ్చి తీసుకెళ్లారు" అంది చిన్న కూతురు. తల్లిని పిలుచుకురావడానికని తమ్ముణ్ణి వెంట బెట్టుకుని వెళ్ళింది.

రామచంద్రం మేస్టారు ఎంత ఉత్సాహంతో, ఎంత హడావుడిగా వచ్చారో అంతగానూ నీరుగారిపోయారు. ఇప్పుడప్పుడే భార్య వచ్చే

సూచన లేదు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మిడ్‌వైఫ్ వుందికదా తీసుకెళ్ళకూడదా అనుకున్నారు. తన మనసులోని ఆనందాన్ని రెండు గంటలపాటు అణచిపెట్టుకోవాలంటే చికాగ్గానే వుంది ఆయనకి.

తడి బట్టలు మార్చుకుని కుర్చీలో కూలబడి పుస్తకంలో వుంచిన కాగితం తీసి మళ్లీ ఓసారి చదువుకున్నారు. ఆ కాగితంలోంచి తల పైకెత్తేసరికి, పెద్ద కూతురు కావిడిపెట్టె మీద కూచునివున్నదల్లా కాళ్ళతో పెట్టెను కొడుతూ శబ్దం చేస్తూ తండ్రి ముఖం వంకే చూసి పళ్లన్నీ కనిపించేలా నవ్వుతోంది.

"ఇలా రామ్మా" అని పిలిచారు తల వూపి.

కాని ఆ అమ్మాయి రాలేదు. చూసి చూసి పెట్టె దిగి దొడ్లోకి వెళ్ళిపోయింది. చూరునించి ధారగా కారుతోన్న నీళ్లని దోసిట్లోకి పట్టి టబ్బున పాదాల మీద పడేసుకుంటూ తనలో తనే నవ్వుకుంటోంది. రామచంద్రం మాస్టారు లేచి వెళ్ళి ఆ అమ్మాయిని లోపలికి తీసుకొచ్చి కూచోబెట్టి "నానమ్మదగ్గరికి వెళ్దాం వస్తావే" అన్నారు. తన తల్లి ఫొటో తీసి చూపించి సంజ్ఞలు చేసి నువ్వూ, నేనూ, అంతా వెళ్దాం అన్నట్టుగా చేతులు వూపి చూపించారు.

ఆ పిల్ల నవ్వింది. ఆ ఫొటో తీసుకుని చూస్తూ కూర్చుంది.

బైటకు వెళ్ళిన పిల్లలిద్దరూ వచ్చారు — "అమ్మ ఇప్పుడప్పుడే రాదట నాన్నా, ఆలస్యమౌతుందిట" అని.

వాళ్ళిద్దరికీ ట్రాన్స్‌ఫర్ విషయం చెప్పారాయన. ఆ పిల్లల ఆనందానికి హద్దే లేదు. ఇద్దరూ వెళ్ళి వాళ్ళక్క దగ్గర కూచుని ఒకటే కబుర్లు. వాళ్ల ఆర్భాటం చూసి ఆ పిల్ల కూడా ఊరికే చేతులు ఊపేస్తోంది. ఏమిటేమిటో మాట్లాడేస్తోంది.

ఆ పెద్దదానికి వాళ్ల నాయనమ్మ దగ్గర చేరిక ఎక్కువ. అదంటే

అమెకు పల్లమూలిన అభిమానం. "ఆ ఎర్రిపిల్ల నెట్టుకుని పరాయి వూళ్ళో ఎం వేగ్గలదో ఏమో. అంతోటి మేష్టరు గిరికీ వున్న పూసు వొదులుకొని వెళ్ళిపోవాలా. ప్రయివేట్లు చెప్పుకుంటే వెళ్ళిపోదా" అనేది.

అప్పటికే పెద్దమ్మాయికి పదేళ్ళు. అపిల్ల ఎర్రిది. చిన్నప్పుడు నాలుగోయేట వరకూ మాటలు రాకపోతే చెవుడుందేమో మూగపిల్ల అయిపోతుంది గాబోలనుకున్నారే గాని వెర్రిపిల్లవుతుందనుకోలేదు. తర్వాత తర్వాత తెలిసింది. పిచ్చి పిచ్చి చేష్టలు చూసి కుళ్ళి కుళ్ళి ఏడ్చారు తలిదండ్రులు. ఇంటావంటా యిరువైపులా ఇటువంటిది ఎవరికీ లేదు. కడుపునకన్నందుకు అలాగే పెంచుకొచ్చారు. వాళ్ల నాయనమ్మ ఆ పిల్లను ఎత్తుకుని తిప్పింది. పక్క పిల్లల్ని కొట్టినా, ఇంట్లో సామాను నేలకేసి కొట్టి పగులగొట్టినా పిచ్చి పిచ్చి పనులతో వేధించినా విసుక్కోకుండా కడుపులో పెట్టుకొని పెంచుకొచ్చింది.

అలాటి పిచ్చి పిల్లతో పరాయిచోట కొడుకు ఎన్ని కష్టాలు పడ్తాడో అని మొదట్లో వెళ్లొద్దంది. "ఇల్లూ, పొలమూ ఎలాగూ వున్నాయి. వూళ్ళోనే వుండి ప్రయివేట్లు చెప్పుకోగూడదా" అంది. కొడుకు వొప్పుకోలేదు. "ఏడాది పనిచేసి ట్రాన్స్ఫర్‌కి పెట్టుకుని మళ్లీ వచ్చేయనూ" అన్నారు రామచంద్రం మాస్టారు. అయితే వెళ్ళిన ఆరేళ్లకుగాని ట్రాన్స్ఫర్ చేయించుకోలేకపోయారు. అదీ ఆయన ప్రయత్నం లేకుండానే జరిగింది. మొదట్లో అన్నివిధాలా ప్రయత్నించి, ఆ వూరికి అలవాటు పడిపోయి మూడేళ్లుగా అ విషయం మర్చిపోయారు. ఇటీవల తల్లి ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే వుండి మాటి మాటికీ వుత్తరాలు రాస్తోంది. ఆవిడ రాయడమైతే రాస్తోందిగాని ఆయన మాత్రం మొదట్లోలా అంతగా

పట్టించుకోలేదు. ఈ ఆరేళ్లలోనూ యీ వూరితో ఆయనకు విడదీయలేని అనుబంధం ఏర్పడిపోయింది. అందుకని ఆయన అశ్రద్ధ చేస్తూనే వచ్చారు. చివరకు ఆయన ప్రయత్నం లేకుండానే ఈ ట్రాన్స్‌ఫర్ వచ్చింది !

రమణమూర్తి గారింటినించి భార్య వచ్చేసరికి బాగా పొద్దు పోయింది. ఈ వార్త వినగానే చాలా సంతోషించింది. అత్తగారెప్పుడూ ఆవిడని కోడరికం పెట్టలేదు. కన్నకూతురిలా చూచుకున్నారు. పైగా ఆవిడ పుట్టిల్లు అక్కడికిబాగా దగ్గర. వీటన్నిటికీ తోడు మరీ యింత పల్లెటూరు కాదది. వూళ్లో కుళాయిలు వున్నాయి. విశాలమైన యిల్లు. కూరగాయలు కావాలంటే సంతరోజువరకూ ఆగక్కరలేదు, దుకాణాలున్నాయి. రోగాలొస్తే మందూ మాకూ తెచ్చుకోడానికి యిద్దరు ముగ్గురు పెద్ద డాక్టర్లే వున్నారు. చూడ్డానికి చిన్నవిగా కనిపించినా యిలాంటి సౌకర్యాలు చాలా వున్నాయి అక్కడ.

ఈ వూరొచ్చాక మొదట్లో ఆమెకు కాస్త యిబ్బందిగానే అనిపించింది. తర్వాత మెల్లగా అలవాటు పడిపోయింది. మళ్లీ యిన్నాళ్లకు అటు వెళ్లిపోవడం ఆమెకు చాలా సంతోషంగా వుంది. అక్కడికి వెళ్లిపోతే పెద్దదాని బాధకూడా కాస్త తప్పుతుంది. అత్తగారు వుంటారు. ఆవిడ చూసుకుంటుంది. సాధారణంగా ఆ పిల్ల బైటికి ఎక్కడికీ వెళ్లదు. ఎప్పుడైనా వెళ్తే గుళ్లోకి వెళ్తుంది. అక్కడే ఏ మండపం మీదో, ఏ నూరువరహాల చెట్టుకిందో కాస్సేపు కూచుని వచ్చేస్తుంది. ఎవరైనా ప్రసాదం యిచ్చినా పుచ్చుకోదు. అల్లరి పెట్టకుండా బుద్ధిగా యింట్లోనే ఏ మూలో పడివుంటుంది. ఎటొచ్చీ అప్పుడప్పుడు కాస్త తిక్క రేగి చేతికి అందుబాటులో ఏదుంటే అది పుచ్చుకుని నేలకేసి కొడుతుంది. లేదా మీదకివిసిరేస్తుంది. అలాంటప్పుడే

కాస్త కనిపెట్టుకుని వుండాలి. అత్తగారు దగ్గరుంటే ఆ బాధ వుండదు. ఈయనకి కూడా ఆ వూరెళ్తే మంచిడాక్టరుతో ఉబ్బసానికి మందిప్పించవచ్చు. తనకీ యీ మధ్య వొంట్లో నీరసంగా వుంటోంది. ఒకసారి పరీక్ష చేయించుకోవచ్చు. అందుకే ఆమెకు యీ వూరు విడిచి వెళ్లిపోతున్నందుకు ఎంత మాత్రం బాధ కలగలేదు.

రామచంద్రం మాస్టారు భోజనం అయ్యాక వుత్తరం మాట గుర్తుకొచ్చి తల్లికి తన ట్రాన్స్‌ఫర్ గురించి వుత్తరం రాద్దామని కూచున్నారు. ఇలా కూచున్నారో లేదో అంతలోకి అయిదారుగురు హడావుడిగావచ్చి "ఏమండి పంతులుగారూ! మీ వూరు బదిలీ అయ్యారట నిజమేనా" అంటూ అడిగారు.

వాళ్లని కూచోబెట్టి తాపీగా తన విషయం వివరించి చెప్పారు మేస్టారు. అది వాళ్లకి తెలీని సంగతేమీ కాదు. మేస్టారు, వారి స్వగ్రామంలో వుండడం ఎంత అవసరమో గూడా వాళ్లకి తెలుసు. అయినా యీ ఊరు విడిచి మేస్టారు వెళ్లిపోవడానికి వారు వొప్పుకోవడం లేదు.

వాళ్లతో మాట్లాడుతుండగానే మరో యిద్దరు వచ్చారు. వాళ్లకీ ఆ వార్త తెలిసిందట. నిజమో కాదో తెలుసుకుందామని వచ్చారట.

రాత్రి చాలా సేపటివరకు మాట్లాడుతూ కూచుండిపోయారు. వాళ్లందరూ వెళ్లిపోయాక మేస్టారు పడుకున్నారుగాని నిద్రపట్టలేదు. ఆయన కళ్లముందంతా ఆ ఊరూ, ఆ ఊళ్లో మనుషులూ వాళ్లు చూపించే అభిమానం, ఆ ఊరుకి తను చేసిపెట్టిన పనులూ, ఆ ఊరి వాళ్ల కృతజ్ఞతా, అమాయకమైన చూపుల్తో "మేస్టారండీ-మేస్టారండీ" అంటూ మరీ అభిమానాన్ని చూపించే బళ్లో పిల్లలూ - యీ దృశ్యాలే

కనిపించాయి. సరిగా నిద్రపోకుండానే ఆరాత్రి ఆయనకు తెల్లారిపోయింది.

పొద్దున్న అరుగుమీద కూచుని దంతధావనం చేసుకొంటుంటే అటువైపుగా వెళ్ళిన ముగ్గురు నలుగురు పలకరించి ఆ విషయమే అడిగారు. స్కూల్లోకూడా ఆయన వెళ్ళేసరికే అందరికీ ఆ వార్త తెలిసిపోయింది. పెందరాళే కొడుకూ, కూతురూ స్కూలుకి వెళ్ళిపోయి యీ వార్తని కాస్తా చాటేశారు. "మేస్టారు మీరు వెళ్ళిపోతున్నారాండీ" అనో, "మీరు యిక్కడే వుండి పోండి మేస్టారూ" అనో, పిల్లలు ఒక్కొక్కరూ వచ్చి అడుగుతోంటే రామచంద్రం మాస్టారుకి ఆ ఊరుని నిజంగానే విడిచి పెట్టాలనిపించడంలేదు. ఆ రోజు క్లాసులో పాఠాలు కూడా సరిగా చెప్పలేదు. హెడ్‌మాస్టరుగారితో " ఆవలెల్లుండి లక్ష్మీ వారంనాడు రిలీవు అవుతానండి " అనిచెప్తే " మీరు వెళ్లక తప్పదంటారా మేస్టారూ " అని అడిగారు. ఆయనకి రామచంద్రం మేస్టారు పరిస్థితులన్నీ తెలుసు. వెళ్ళొద్దనీ అనలేరు. వెళ్లమనీ చెప్పలేరు. వెళ్ళిపోతే యీ స్కూలు చిన్నబోతుందని ఆయనకు తెలీనిది కాదు.

ఆ సాయంకాలం స్కూలు విడిచిపెట్టేవేళకు హెడ్‌మేష్టరుగారు రామచంద్రం మేస్టారుని తనరూముకి పిలిపించుకుని " మేస్టారూ ! మన స్టాఫ్‌వాళ్లు మీకు పార్టీ యివ్వాలనుకుంటున్నారండి. పిల్లలు మీటింగు పెట్టాం అంటున్నారు. ఎల్లుండి మళ్లీ మీకు తీరిక వుండదేమో. సర్పంచ్ గారు ఆ రోజు పార్టీ ఏర్పాటు చేస్తున్నట్టు మధ్యాహ్నమే చెప్పారు. అందుకని మేము రేపు సాయంకాలం పెట్టుకున్నాం " అని చెప్పారు.

ఎందుకండీ యీ ఆర్భాటమంతా అంటే వొప్పుకోలేదు.

ఇంటికొచ్చి ఆ విషయం భార్యతో చెప్పారు. " నిజమేనండీ,

ఇంత మంచి వూరుని విడిచిపెట్టాలంటే ఏమిటో దిగులుగానే వుంది" అంది ఆమె.

రాత్రి తొందరగానే భోంచేసి ప్రైమరీ హెల్తు సెంటరు కాంపౌండరు పరబ్రహ్మానికీ, గుళ్లో పూజారి సుదర్శనాచార్యుల వారికీ, అపరాలకొట్టు చంద్రియ్యకూ, యింకా అయిదారుగురు తెలిసిన వారికీ తన ట్రాన్స్‌ఫర్ వార్త చెప్పివచ్చారు. ఇంటికి వచ్చేసరికి అరుగుమీద సర్పంచీ మిగతా పంచాయతీ మెంబర్లూ కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

తన గురించి అంతమంది తరలివచ్చి ఎదురు చూస్తూ కూచోడం చూసి చాలా తప్పుచేసినట్టు క్షమాపణలు చెప్పుకున్నారు రామచంద్రం మేస్టారు.

"ఫరవాలేదు. దానికేంలెండి. ఏమీలేదు— ఎల్లుండి పంచాయతీ ఆఫీసు ఆవరణలో చిన్నమీటింగు ఒకటి ఏర్పాటు చేద్దామనుకుంటున్నాం. మా సభ్యులు పార్టీ కూడా ఏర్పాటు చేస్తున్నారు. అబ్బే అదేం కుదరదు, వొప్పుకోవలసిందే. మీకు మా ఊరు చాలా ఋణపడివుంది పంతులుగారూ. మీరు వెళ్ళిపోవడం చాలా లోటు ఏదో మా కృతజ్ఞత తెలుపుకుందామని. అంతే, మరేం లేదు."

రామచంద్రం మేస్టారు ఏదో అందామనుకున్నారు గాని సభ్యులంతా తలా ఒకమాట చెప్పి, ఆయన్ని మరోమాటమాట్లాడనీయ లేదు. మర్నాడు మధ్యాహ్నంనించి స్కూల్లో క్లాసులేం జరగలేదు. తోటి టీచర్లంతా చిన్న పార్టీ యిచ్చాక పేరియర్ హాల్లో మీటింగు జరిగింది. హెడ్‌మాస్టరు గారు అధ్యక్షత వహించారు. కొందరు ఉపాధ్యాయులూ, పిల్లలూ రామచంద్రంమేస్టార్ని గురించి మాట్లాడారు. పిల్లలు గుర్తుగా మేస్టారుకి ఒక ఖరీదైన పెన్ను బహూకరించారు.

మేస్టారు కృతజ్ఞతలు చెప్పుకొనేప్పుడు ఆయన కళ్లు చెమ్మగిల్లాయి. ఆయన కంఠం బొంగురుపోయింది. ఎక్కువసేపు మాట్లాడలేక పోయారు.

మర్నాడు పంచాయతీ ఆఫీసు ఆవరణలో జరిగిన సభలోగూడా ఆయన ఎక్కువసేపు మాట్లాడలేకపోయారు.

"పంతులుగారి లాటి వారిని చాలా అరుదుగా చూస్తాం. ఆయన మన ఊరికి చేసిన సేవను ఎవరూ మర్చిపోలేరు. ఈ ఊరుని ఎన్నో రకాలుగా బాగుచేసిన మహానుభావుడాయన. అలాటి వారికి ఎలా మన కృతజ్ఞత తెలుపుకోవాలో గూడా నాకు తెలీకుండా వుంది" అన్నాడు సర్పంచ్. సర్పంచ్ పెద్ద కొడుకు యిరవైయేళ్లవాడు ఆ ఊరి యువకమండలి తరపున గాంధీగారి బొమ్మ ప్లాస్టర్ ఆఫ్ పేరిస్‌ది ప్రిజంటు చేశాడు. ఊళ్లో పెద్దలనుకునే వాళ్ళు పదిమందీ వచ్చి మాట్లాడారు.

రామచంద్రం మేస్టారు కండువాతో కళ్లు తుడుచుకున్నారు. చాలా విషయాలు మాట్లాడుదామని లేచి నుంచుని మాటిమాటికీ కంఠం బొంగురుపోయి ప్రసంగం విరిగిపోతుండడంవల్ల ముందుకి పోలేక "ఇంత మంచి ఊరుని, ఇంత మంచి మనుషుల్ని విడిచి వెళ్లిపోవాలంటే నాకు చాలా బాధగా వుంది. ఈ ఊరుని నేనెప్పటికి మర్చిపోలేను. మీకందరికీ నా నమస్కారం" అంటూ మధ్యలోనే ముగించేసి కూచుండిపోయారు. కండువాతో కళ్ళద్దాల్ని తుడుచుకున్నారు. అలా కళ్లనుగూడా.

ఆ రాత్రి ఆయనగాని, ఆయన భార్యగాని నిద్రపోనేలేదు. పూరి కబుర్లు చెప్పుకుంటూ మేలుకునే గడిపారు. ఒక సమయంలో "పోనీ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ కేన్సిల్ చేయించుకుని యిక్కడే వుండి

పోదామంటావా ?" అని గూడా భార్యని అడిగారాయన. ఆమె "ఇంకా నయం. రాత్రి మీటింగులో నోరుజారి యీ మాట అన్నారుకారు" అని భర్తని మెల్లగా మందలించింది.

ఉదయం స్కూలు పిల్లలు వచ్చి సామాన్లు మూటలుకట్టేశారు. రామచంద్రం మేస్టారు స్కూలుకి వెళ్లి చార్జీ వప్పజెప్పి ఊళ్లో తెలిసిన వాళ్లందరికీ చెప్పి వచ్చేసరికి పన్నెండయ్యింది. హడావుడిగా ఏదో యింత తిని ఒంటిగంటకి బస్‌స్టాండుకి చేరుకున్నారు. వారిని సాగనంపడానికి ఊరుఊరంతా అక్కడే వున్నట్టుగా వుంది, స్కూలు నించి పిల్లలూ, మేస్టార్లూ వచ్చారు. సర్పంచ్‌తో సహా ఊరి పెద్దలంతా అక్కడే వున్నారు.

బస్సు వచ్చాక వాళ్లే గబగబా సామానంతా పైకి ఎక్కించేశారు. మేస్టారు కుటుంబం లోపల సుఖంగా కూచోడానికి బస్సులోవాళ్లని అర్భాటం చేసి విశాలంగా జాగాచేసి కూచోబెట్టారు. బస్సు కదిలినప్పుడు చేతులు జోడించిన మేస్టారుతో "మర్చిపోకండి మేస్టారుగారూ! ఎప్పుడైనా వస్తూవుండండి" అంటూ అంతా ప్రీతి నమస్కారం చేశారు. బస్సులో కూచుని ఆలోచిస్తూన్న మేస్టారుకి ఈ అనుభవం తన జీవితంలో మర్చిపోలేనిదనిపించింది. ఇంతమంది యిలా తన మీద అభిమానం చూపించడం తన జీవితంలో యింతకు ముందెప్పుడూ ఎదురుపడలేదు. ఇంత మంచి మనుషుల్నీ, ఇంత మంచి ఊరునీ వదులుకొని వెళ్లిపోయి తను పొరపాటు పనే చేస్తున్నానేమో అని అనుకున్నారాయన.

చెట్ల మధ్య ఊరు మాయమై మరిక కనిపించడం మానేసే వరకు మాటిమాటికి వెనక్కుతిరిగి చూస్తూనేవున్నారు.

ఆయన భార్యగూడా యించుమించు అదే స్థితిలో వుంది. పిల్లల

మాటమరిక చెప్పనే అక్కరలేదు. దిగులుగా కూచుని కళ్లలో నీళ్ళు నింపుకున్నారు. వెర్రిపిల్ల కూడా బస్సులో ఎక్కాననన్న ఉత్సాహం ఏమాత్రం లేకుండా దగ్గరగా ముడుచుకుపోయి దిగులుగా కూచుంది.

మూడున్నర గంటలు ఎలా ప్రయాణం చేసారో వాళ్ళెవరికీ గుర్తులేదు. మనసంతా అక్కడే ఆ విడిచి వచ్చేసిన వూళ్ళోనే వుంది. స్వగ్రామంలో అడుగుపెట్టాక, స్వంత యిల్లు కనిపించాక, యింట్లో తల్లిని చూశాక మనసు కాస్త కుదుట పడింది. స్వంత వూరు చేరుకున్న సంతోషం మెల్లమెల్లగా ఆయన్ని ఆవరించింది.

రామచంద్రం మేష్టారు ఆ వూరును గురించీ, ఆ వూళ్ళో మనుషుల మంచితనం గురించీ చాలా మందికి గొప్పగా చెప్పుకున్నాడు. స్కూలు పిల్లలతో కూడా "అక్కడి బళ్ళో పిల్లలు చాలా మంచి వాళ్ళరా. శ్రద్ధగా చదువుకుంటారు. మేష్టర్లంటే భయభక్తులు చూపుతారు, అల్లరిచేయరు" అంటూ నీతి వాక్యాలు బోధించినట్టు మూడు నాలుగుసార్లు చెప్పారు.

రామచంద్రం మేష్టారు వచ్చి పదిహేను రోజులు పైనే అయినా యింకా ఆ వూరు మాటి మాటికీ ఆయనకు గుర్తుకొస్తూనే వుంది. వచ్చిన అయిదు రోజులకు ఆ వూరి సర్పంచ్‌కు ఉత్తరం రాశారు. ఇంకా సమాధానం రాలేదు. మధ్యాహ్నం స్కూలునించి భోజనానికని యింటికి వచ్చినప్పుడు "ఉత్తరాలు ఏమన్నా వచ్చాయా?" అని అడిగితే భార్య కాస్త ఎగతాళిగానే మాట్లాడింది.

"పోస్ట్‌మాన్ యింకా రాలేదు. అప్పటినుంచీ, వూరొదిలి వచ్చినా మనసంతా అక్కడే వుంది మీకు. ఉత్తరం రాలేదని బెంగట్టుకున్నారల్లే వుంది. చూస్తుంటే రేపుకూడా వుత్తరం రాకపోతే ఎల్లుండి ఆ వూరు వెళ్ళొచ్చేసేట్టే వున్నారు" అంది.

"అవును సుమా! ఒకసారి వెళ్ళొస్తే బావుండును" అన్నారాయన తనలో తనే అనుకుంటున్నట్టు. స్కూలుకి వెళ్ళిపోతూ "బహుశా ఉత్తరం వస్తుందేమోలే స్కూల్లో యివ్వమని చెప్పు. అని చెప్పి వెళ్ళిపోయారు.

రామచంద్రం మేష్టారు స్కూలు విడిచిపెట్టే వేళవరకు ఉత్తరం గురించి చూశారు గాని రాలేదు. ఒకవేళ యింట్లో పడేసి వెళ్ళి పోయాడేమో పోస్ట్‌మేన్ అనుకుంటూ హడావుడిగా యింటికొచ్చిన రామచంద్రం మేస్టారుకి యింట్లో పరిస్థితి చూసేసరికి ఆశ్చర్యం వేసింది. ఇంట్లో ఓ మూల తల్లీ, మరో మూల భార్యా శోకాలు పెడుతున్నారు. పిల్లలు ముగ్గురూ బిక్క మొఖాలు వేసుక్కూచున్నారు.

కొడుకునుచూసి ముసలితల్లి కంఠం మరికాస్త పెద్దదిచేసింది.

"ఏమైంది?" అన్నట్టు చూశారు రామచంద్రం మేస్టారు.

ఆవిడ శోకాలు తీయడమే తప్ప ఏమీ చెప్పనేలేదు.

"ఏమైందే. చెప్పి, ఆ తర్వాత తీరిగ్గా ఏడవండి" అంటూ విసుక్కున్నారు భార్యను చూసి.

భార్య ముక్కు చీదుకుని ఏడుస్తూనే "ఇంకా ఏం జరగాలి, జరగాల్సినంతా జరిగింది. మంచి వూరు మంచి వూరని వేశ్నాడేరు. ఇదేనా మంచి. అభమూ శుభమూ ఎరగని ఆ ఎర్రిదాని బ్రతుకు బుగ్గి పాలుచేశారు కదా. ఒంట్లో నలతగా వుందేమోనని యిందాక డాక్టరు దగ్గరకి తీసుకెళ్తే తెలిసింది. దాన్ని చూస్తేనే కడుపు తరుక్కు పోతోందే. అలాటి దాని బ్రతుకు పాడుచేయడానికి ఏ రాక్షసుడికి చేతులొచ్చాయో. ఎర్రిదన్న జాలైనా లేకుండా దాని జీవితాన్నిలా—" ఆమె యిక మాట్లాడలేక గొల్లుమంది.

రామచంద్రం మేస్టారు రాయిలా ఆ గదిలో నిలుచుండిపోయారు.